కొనసాగుతున్న రేషన్ కార్డు దరఖాస్తుల ప్రక్రియ


సురేందర్

యాకుత్‌పురా: నూతన రేషన్ కార్డుల కోసం ఆన్‌లైన్ ద్వారా అందిన దరఖాస్తుల పరిశీలన కొనసాగుతుందని పౌర సరఫరాల శాఖ యాకుత్‌పురా సర్కిల్–02 ఏసీఎస్‌ఓ సురేందర్ తెలిపారు. పురానిహవేలీలోని తన కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. నూతన రేషన్ కార్డుల కోసం ఆన్‌లైన్ ద్వారా 28 వేల దరఖాస్తులు అందాయన్నారు. ఇప్పటికే రేషన్ కార్డులు కలిగి ఉండి తమ పేర్ల తొలగింపు కోసం 12700ల దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు 7800 పేర్లను తొలగించమన్నారు. అదే విధంగా రేషన్ కార్డు ఉన్న వారు అదనపు కుటుంబసభ్యులు వివరాలను సైతం నమోదు చేసుకోవాలన్నారు.

దివ్యాంగులకు అండగా మజ్లిస్



గోల్కొండ: దివ్యాంగులకు మజ్లిస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయనను గ్రేటర్ హైదరాబాద్ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మజ్లిస్ సీనియర్ నాయకుడు మహ్మద్ జాహెద్ చోటా బజార్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కార్వాన్ నియోజకవర్గంలో అర్హులైన దివ్యాంగులందరికీ తాను అండగా ఉంటానన్నారు. అదే విధంగా బల్దియా నుంచి దివ్యాంగులకు ట్రై సైకిల్స్ ఇప్పించామన్నారు. చాలా మంది దివ్యాంగులు నేడు ఆర్థికంగా ఎదిగి తమ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు వజీఉజ్జమా, హబీబ్ చౌస్, సలీం తదితరులున్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

బహదూర్‌పురా: మనస్తాపంతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఈ ఘటన బహదూర్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..కిషన్ బాగ్ అసద్ బాబానగర్‌కు చెందిన మహ్మద్ గౌస్ షరీఫ్ కుమారుడు మహ్మద్ షోయబ్ షరీఫ్ (18) డ్రైవర్. బుధవారం బయటికి వెళ్లిన అతను రాత్రి 2 గంటల సమయంలో ఇంటికి వచ్చి తన గదిలో నిద్ర పోయాడు. తెల్లవారిన తర్వాత ఎంతకూ గదిలో నుంచి బయటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బలవంతంగా తలుపులు తెరిచి చూసేసరికి ఉరేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఓ యువతితో ప్రేమ వ్యవహారమే ఆత్మహత్యకు కారణమని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బహదూర్‌పురాలో భారీ అగ్నిప్రమాదం



బహదూర్‌పురా: బహదూర్‌పురా చౌరస్తాలోని ఓ లారీల మెకానిక్ షెడ్‌లో గురువారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది, పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..నాంపల్లికి చెందిన జలాలుద్దీన్ కొంత కాలంగా మెకానిక్ షెడ్ నిర్వహిస్తున్నాడు. లారీలు, బస్సులు, ఇతర వాహనాలను తుక్కుగా మారుస్తారు. ఇక్కడ పెద్ద ఎత్తున తుక్కు, సీట్ల కవర్లు, రబ్బర్ ట్యూబ్‌లు పోగేసి ఉంచారు. గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు మంటలంటుకున్నాయి. సమాచారమందుకున్న బహదూర్‌పురా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదం జరిగిన కొద్ది దూరంలోనే గ్యాస్ పంపు కూడా ఉంది. గతంలోనూ ఈ షెడ్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది..ఈ షెడ్డులో ఎలాంటి అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేయకుండానే షెడ్డులు, లారీలను తుక్కుగా మారుస్తున్నారనే కారణంతో నిర్వాహకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పేదలకు వరం జకాత్

- సంపాదించే ప్రతి పురుషుడు, మహిళకు జకాత్ వర్తిస్తుంది
- జకాత్‌తో వేలాది కుటుంబాలకు లబ్ధి
- ఇస్లాం ఐదు మూల సిద్ధాంతాల్లో జకాత్ ఒకటి

గోల్కొండ: రంజాన్ మాసం వచ్చిందంటే నిరుపేదల చూపు జకాత్ వైపే ఉంటుంది. జకాత్ అంటే ఇస్లాం మతంలో ఉన్న ఐదు మూల సిద్ధాంతాల్లో ఒకటి. సంపాదించే ప్రతి పురుషుడు, మహిళకు జకాత్ వర్తిస్తుందని ఖురాన్‌లో స్పష్టంగా ఉంది. తమ ఆదాయంలో నుంచి జకాత్ ఇవ్వకపోతే ఆ ఆదాయం ఖురాన్ ప్రకారం దైవసమ్మతికి యోగ్యత ఉండదు. జకాత్‌కు అర్హులైన వారు మసీదు ఇమామ్‌లను సంప్రదించి జకాత్ ఎంత ఇవ్వాలో నిర్ణయించుకోవాలి. జకాత్‌ను నిరుపేదలకు, నిరుపేదలైన తమ సమీప బంధువులకు, దివ్యాంగులకు మాత్రమే ఇవ్వాలి. జకాత్‌ను ధన రూపంలో గానీ, నిత్యావసర వస్తువుల రూపంలో గానీ ఇవ్వవచ్చు. మరికొంత దుస్తుల రూపంలో కూడా ఇవ్వవచ్చు. అయితే నిరుపేదల కోసం పని చేసే స్వచ్ఛంద సేవా సంస్థలకు కూడా జకాత్‌ను ఇవ్వవచ్చు. నేడు ముస్లిం సమాజంలో జకాత్‌ను సేకరించి నిరుపేదలకు పంపిణీ చేసే స్వచ్ఛంద సేవా సంస్థలు ఎన్నో ఉన్నాయి. రంజాన్ మాసంలో చదువుకున్న యువకులు, ముస్లిం ఉద్యోగుల తమతమ జకాత్‌ను ఒక దగ్గర కలిపి నిరుపేదలను గుర్తించి వారికి అందిస్తుంటారు. టోలిచౌకీకి చెందిన తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్,


జకాత్ కోసం నిత్యావసర వస్తువుల కిట్ల తయారీ

గోల్కొండ యూత్ అసోసియేషన్, మెహిదీపట్నం పూర్ ముస్లిం వెల్ఫేర్ సొసైటీలు, వ్యాపారులు ఉద్యోగుల నుంచి సేకరించిన జకాత్ డబ్బులతో మసీదులలో తల్లిదండ్రులకు డబ్బు, లేదా నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నారు.

జకాత్ లెక్కకట్టే విధానం..

- ఒక వ్యక్తి తాను న్యాయబద్ధంగా సంపాదించిన డబ్బు నుంచి తనకు తోచిన విధంగా ఆ డబ్బు నుంచి కొంత భాగం జకాత్‌కు ఇవ్వాలి.
- ఓ వ్యక్తి దగ్గర ఏడున్నర తులాల బంగారం లేదా 52 తులాల వెండి ఉంటే అటువంటి జకాత్ ఇవ్వాలి.
- తమవద్ద ఉన్న వెండి, బంగారం రంజాన్ మాసంలో వాటి విలువ కట్టాలి. ఆ విలువ నుంచి రెండున్నర శాతం జకాత్‌కు కేటాయించాలి.
- ఓ వ్యక్తి స్థిరాస్తిలో ఆదాయంలో ఏమైనా మిగులు ఉంటే దానికి కూడా జకాత్ వర్తిస్తుంది.
- ఒక వేళ రంజాన్ మాసంలోనే బంగారం, లేదా వెండి కొంటే ఆ సంవత్సరం ఆ వెండి, బంగారానికి జకాత్ వర్తించదు.
- బంగారు ఆభరణాలు తూకం వేయడంలో, స్థిరాస్తులపై ఉన్న నగదు ఆదాయం లెక్కింపులో పారదర్శకత ఉండాలి.
- దివ్యాంగులు, నిరుపేదలకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి.
- జకాత్ ఇచ్చే వారు వారి బంధువులలో నిరుపేదలు ఉంటే ముందుగా అటువంటి వారికే జకాత్ ఇవ్వాలి.

జకాత్ ఇవ్వడం తప్పనిసరి...



న్యాయపరంగా సంపాదించే వారందరికీ జకాత్ వర్తిస్తుంది. బంగారం, వెండి ఆభరణాలు ఉన్న వారు సైతం తప్పనిసరిగా రంజాన్ మాసంలో జకాత్ ఇవ్వాల్సిందే. ఆభరణాలను మార్కెట్ ప్రకారం విలువ కట్టాలి. ఆదాయ వనరులు ఉండి కూడా జకాత్ ఇవ్వకపోతే దేవుడి దృష్టిలో వారు దోషులుగా పరిగణింపబడతారు.

– మౌలానా సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ, ఆల్ ఇండియా సిరత్ కమిటీ అధ్యక్షుడు

వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అబిడ్స్: వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ టీఎన్జీఓస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మహ్మద్ ముజాహీద్ హుస్సేన్ పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన డైరెక్టర్ హరితను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహీద్ హుస్సేన్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, అబిడ్స్ డివిజన్ అధ్యక్షుడు విక్టర్ పాల్, కరీంనగర్ డివిజన్ అధ్యక్షుడు భిక్షపతి సారయ్య తదితరులు ఆమెను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముజాహీద్ హుస్సేన్ మాట్లాడుతూ..ప్రభుత్వ ఖజానకు రెవెన్యూ పెంచే విధంగా వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులు కృషి చేయాలన్నారు. మార్చి నెల


హరితను సన్మానిస్తున్న మహ్మద్ ముజాహీద్ హుస్సేన్ తదితరులు

ఉద్యోగులకు ఎంతో కీలకమని, ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేసి వాణిజ్య పన్నుల శాఖ ఆర్థిక ఆదాయాన్ని పెంచేందుకు పాటుపడాలన్నారు.

పన్ను బకాయిలను సకాలంలో చెల్లించండి


అరుణకుమారి

బహదూర్‌పురా: ఫలక్‌నుమా సర్కిల్ పరిధిలో ప్రాపర్టీ టాక్స్ వసూళ్లను వంద శాతం పూర్తి చేసే దిశలో చర్యలు తీసుకుంటున్నామని సర్కిల్–10 డిప్యూటీ కమిషనర్ అరుణ కుమారి అన్నారు. పన్ను బకాయిలు సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు సిబ్బందితో వివరిస్తున్నారు. పన్ను చెల్లింపులలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించి ప్రజలు నిర్ణీత సమయం లోపల ప్రాపర్టీ టాక్స్‌లు చెల్లించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు, సర్కిల్–10 కార్యాలయం చాంబర్‌లో ప్రాపర్టీ టాక్స్ పరిష్కారం కార్యక్రమం నిర్వహించారు. టాక్స్ విషయంలో ప్రజలు తమకున్న సమస్యలను అనుమానాలను ఈ కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు ప్రజల సమస్యలు పరిష్కరించడంలో దృష్టి సారించారు.

'చేతిరాత పోటీల్లో విద్యాశ్రీ హైస్కూల్ సత్తా'


శ్యామ్ వెరా

జియాగూడ: తెలంగాణ రాష్ట్ర స్థాయి చేతి రాత పోటీల్లో జియాగూడ విద్యాశ్రీ హైస్కూల్ విద్యార్థులు 180 అవార్డులను గెలుచుకున్నారని విద్యాశ్రీ హైస్కూల్ చైర్మన్ శ్యామ్ వెరా అన్నారు. గురువారం స్కూల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఇటీవల అక్షర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర స్థాయిలో వివిధ స్కూళ్లల్లో సుమారు 12000 మంది విద్యార్థులు చేతిరాత పోటీల్లో పాల్గొనగా 180 మంది విద్యార్థులు గెలిచారని, వీరందరికీ 8వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు స్కూల్ ఆడిటోరియంలో అక్షర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ వారు సర్టిఫికెట్లు, మెడల్స్‌లను బహూకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కుల్సుంపురా ఏసీపీ మునావర్, కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ యూత్ అధ్యక్షుడు కిరణ్ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు.

అమ్మాయిలను వేధిస్తున్న వ్యక్తికి జైలు

గౌలిపురా: అమ్మాయిలను వేధింపులకు గురిచేస్తున్న ఓ వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్ష విధించిన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన అక్రమ్ (35) భవానీనగర్ స్టేషన్ పరిధిలో అమ్మాయిలను వేధింపులకు గురి చేస్తున్నాడు. దీనిపై ఫిర్యాదు మేరకు పోలీసులు అక్రమ్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. అనంతరం అక్రమ్‌ను గురువారం నాంపల్లిలోని కోర్టులో హాజరుపరచగా పూర్వపరాలను పరిశీలించిన ఇన్‌చార్జి స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ నిందితుడు అక్రమ్‌కు ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

బాలుడి అదృశ్యం


షేక్ గౌస్ పాషా

డబీర్‌పురా: దివ్యాంగ బాలుడు అదృశ్యమైన ఘటన మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై అరుణోదయ తెలిపిన వివరాల ప్రకారం..మీర్‌చౌక్ మగర్‌కీబౌలికి చెందిన షేక్ ఖాదర్ కుమారుడు షేక్ గౌస్ పాషా (16) దివ్యాంగుడు సరిగ్గా మాట్లాడలేడు. ప్రతిరోజూ మసీదుకు వెళ్లి ప్రార్థనలు చేసుకొనే వచ్చేవాడు. ఇందులో భాగంగా ఫిబ్రవరి 11న ఇంట్లో నుంచి ప్రార్థనల కోసం బయటికి వెళ్లిన షేక్ గౌస్ పాషా తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తుందని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. గురువారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో సరోజినీ నాయుడు వనితా ఫార్మసీ మహా విద్యాలయ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ ఫార్మసి ఎడ్యుకేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా ఫార్మా అన్వేషణ్–2025 పేరిట ఫార్మా ఎంటర్‌ప్యూనర్‌షిప్, స్టార్టప్‌పై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..ఫార్మా రంగం భారతదేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా కీలక పాత్రను కలిగి ఉందని తెలిపారు. మెడికల్ రంగంలో యువత ఔత్సాహికులు నూతన అన్వేషణలు, స్టార్టప్ ప్రారంభించి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం కళాశాల సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సరోజినీ నాయుడు ఫార్మసీ మహా విద్యాలయ చైర్మన్ డాక్టర్ ప్రభాశంకర్, వివిధ సంస్థల ప్రతినిధులు కె.బాలరాజు, గొల్ల సునీల్, డాక్టర్ నందన్‌కుమార్, రఘువీర్, ఎ.కార్తిక్‌రావు, నాగేశ్వర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే మహిళా సాధికారత సాధ్యం

సుల్తాన్‌బజార్: బాలికల విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని తెలంగాణ వైద్య, ప్రజా ఆరోగ్య అదనపు సంచాలకులు కాకుమాను శశిశ్రీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య ప్రజారోగ్య శాఖ ఫిమేల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.మహాలమ్మ ఆధ్వర్యంలో గురువారం కోఠి సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవరాయ భాషానిలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆకాశమే హద్దుగా ఎదిగిన, ఎదుగుతున్న మహిళామణులను స్ఫూర్తిగా తీసుకుని నేటి విద్యార్థినులు, తమ లక్ష్యాన్ని ఛేదించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో అసాధారణ ప్రతిభావంతమైన పాత్ర పోషిస్తూ సాధారణ మహిళలు సాధించిన, సాధిస్తున్న విజయాలు, వారి ధైర్యం, దృఢ సంకల్పం భావి తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. తెలంగాణ రాష్ట్ర


మట్లాడుతున్న శశిశ్రీ

ఐవీఎఫ్ కేంద్రాల నోడల్ అధికారిణి డాక్టర్ జానకి మాట్లాడుతూ.. గృహిణులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ విజయనిర్మల, రమాదేవి, సక్కుబాయి, ప్రమీళ, ఎస్.మల్లేశ్వరీ, రాజశ్రీ, పద్మావతి, భాగ్యలక్ష్మీ, వసంత, ప్రభావతి, రాజమణి, ఉమా మహేశ్వరీ, ఖుర్షీదాబేగం, పైడి విజయ పాల్గొన్నారు.

జోరుగా ఇఫ్తార్ విందులు


ఇఫ్తార్ విందులో అంజదుల్లాఖాన్


ఇఫ్తార్ విందులో చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ


ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

చార్మినార్: రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు జోరుగా కొనసాగుతున్నాయి. వివిధ రాజకీయ పార్టీలతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు ముస్లింలకు ఇఫ్తార్ విందును అందజేస్తూ వారిపట్ల తమకున్న సోదరభావాన్ని చాటిచెబుతున్నారు. ఇఫ్తార్ విందును పురస్కరించుకొని మజ్లిస్ పార్టీతో పాటు మజ్లిస్ బచావ్ తహ్రీక్ పార్టీల ఆధ్వర్యంలో జోరుగా ఇఫ్తార్ విందులు కొనసాగుతున్నాయి. మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయా నియోజకవర్గాలలోని డివిజన్ల వారీగా జరుగుతున్న ఇఫ్తార్ విందులో మజ్లిస్ పార్టీ ఫ్లోర్ లీడర్, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ స్థానిక మజ్లిస్ కార్పొరేటర్, నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొంటుండగా..ఎంబీటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇఫ్తార్ విందులలో ఎంబీటీ అధ్యక్షుడు ఫర్హతుల్లాఖాన్, మాజీ కార్పొరేటర్ అంజదుల్లాఖాన్ తదితరులు పాల్గొంటున్నారు.

హకీంపేట్‌లో..

గోల్కొండ: నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్ సనా హోటల్ వద్ద ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్, అలీముద్దీన్, మజీద్, సయ్యద్ రఫత్‌హుస్సేన్, అబ్బాస్ తదితరులు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

శ్రీరామ నవమి శోభాయాత్రకు అన్ని ఏర్పాట్లు చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: శ్రీరామ నవమి శోభాయాత్రకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. గురువారం ధూల్‌పేట ఆకాష్‌పురి హనుమాన్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వివిధ శాఖల అధికారుల సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత సంవత్సరం శ్రీరామ నవమి శోభాయాత్రలో జరిగిన పొరపాట్లను అధిరోహించి అన్ని శాఖల అధికారులు కో ఆర్డినేషన్‌గా ఉండి ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలన్నారు. ఏప్రిల్ 6న ధూల్‌పేట నుంచి వేలాది మందితో శోభాయాత్ర గత సంవత్సరం మాదిరిగా చేపడుతామన్నారు. ముఖ్యంగా శోభాయాత్ర వెళ్లే రహదారులలో రోడ్ల మరమ్మతులు, ఇతర సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలన్నారు. అన్ని ప్రాంతాల్లో వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. శోభాయాత్రకు నగరవాసులే కాక రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి లక్షల మంది రామభక్తులు పాల్గొంటారని వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా వివిధ శాఖల అధికారులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ–14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి.లావణ్య, వాటర్‌బోర్డు జీఎం జాన్ షరీఫ్, ఇతర పలువురు అధికారులు పాల్గొన్నారు.

నత్తనడకన నాలా నిర్మాణ పనులు


కొనసాగుతున్న గోషామహల్ నాలా పనులు

అబిడ్స్: గోషామహల్–చాక్నవాడి నాలా నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు నెలల క్రితం నాలా నేలమట్టం కావడంతో జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ అబిడ్స్ ఇంజినీరింగ్ అధికారులు నాలా పనులు ప్రారంభించారు. పనులు కొనసాగుతుండగా మరో మూడు సార్లు నాలా అక్కడక్కడ కూలింది. నాణ్యతలేని పనులతో మెల్లమెల్లగా పనులు కొనసాగుతున్నాయి. దీంతో స్థానిక వ్యాపారాలు, ప్రజలు నరకయాతన పడుతున్నారు. కొన్ని రోజులుగా దారుసలాం నుంచి గోషామహల్ రోడ్డును కూడా మూసివేశారు. రోడ్డును మూసివేయడంతో వాహనదారులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే వేగవంతంగా పనులు చేపట్టాలని లేనిచో జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి ఫిర్యాదు చేయనున్నట్లు గోషామహల్ బీజేపీ నాయకులు ఆల పురుషోత్తమ్ రావు పేర్కొన్నారు. 14వ సర్కిల్ ఇంజినీరింగ్ అధికారులు నిర్వహణ పనులపై శ్రద్ధ చూపడంలేదన్నారు. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంటనే ఒక్కసారి పర్యటించి నాలా పనులు వేగంగా అయ్యే విధంగా కృషి చేయాలన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా



గోల్కొండ: ప్రభుత్వ కళాశాలల్లో అత్యుత్తమ విద్యాబోధన జరుగుతుందని గోల్కొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టి.శ్రీలక్ష్మి అన్నారు. గురువారం కళాశాలలో అనుదీప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తమ వద్ద డిగ్రీ పూర్తి చేసుకున్న వారిలో చాలా మంది మంచి ఉద్యోగాలు సంపాదించారన్నారు. దిగ్గజ కంపెనీలు తమ కళాశాల క్యాంపస్‌కు వచ్చి క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లు చేస్తున్నాయన్నారు. ప్లేస్‌మెంట్ సెల్ మేనేజర్ లకావత్ సాగర్ మాట్లాడుతూ..ఈ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించడం తమకు కొత్త అనుభూతి కలిగిందన్నారు. ఈ జాబ్ ప్లేస్‌మెంట్‌లో చివరి సంవత్సరం చదువుతున్న 40 మంది విద్యార్థినులను జన్‌ప్యాక్ట్, టీమ్ లీజ్ కంపెనీలు నియామక ఉత్తర్వులు అందజేశాయి. ఈ కార్యక్రమంలో అనుదీప్ ఫౌండేషన్‌కు చెందిన శ్రీకాంత్, జన్‌ప్యాక్ నుంచి శివ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమేరా సైద్, వ్యాపార గణక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎస్.జయశ్రీ, ఐక్యాక్ కోఆర్డినేటర్ రజనీ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అఫ్జల్‌గంజ్: దారుసలాం నుంచి గోషామహల్ చౌరస్తా వరకు రోడ్డుకు మధ్యలో ఉన్న హైటెన్షన్ వైర్లను, విద్యుత్ స్తంభాలను వెనక్కి జరిపి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని గోషామహల్ బీఆర్ఎస్ నేత ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం విద్యుత్ శాఖ సీఎండీ ముషరఫ్ ఫారూఖిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గౌలిగూడలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ..దారుసలాం నుంచి గోషామహల్ చౌరస్తా వరకు హైటెన్షన్ వైర్లు, విద్యుత్ స్తంభాలు రోడ్డుపై ఉండడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. స్థానిక ప్రజలు, స్థానిక వ్యాపారాలు ట్రాఫిక్ సమస్యతో నరకం చూస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే సమస్య పరిష్కరిస్తామని సీఎండీ ముషరఫ్ ఫారూఖి హామీ ఇచ్చినట్లు ఆనంద్‌కుమార్ గౌడ్ తెలిపారు.

బీజేపీ నేతల సంబరాలు


మంగళ్‌ముఖి హనుమాన్ ఆలయం వద్ద..

గౌలిపురా: కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై గురువారం గౌలిపురా హనుమాన్‌నగర్ మంగళ్‌ముఖి హనుమాన్ ఆలయం వద్ద బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సీహెచ్.రూప్‌రాజ్, కాడి సురేందర్, జి.రఘుకాంత్, జమాల్‌పూర్ అశోక్, ఎ.భానుప్రకాశ్, కె.రాజ్ కుమార్, కె.ప్రేమ్‌రాజ్, ఎ.శివచంద్రగిరి, బి.రమేశ్ యాదవ్, సాయి సందీప్, ఎం.వెంకటేశ్, సాకేత్, కె.యాదయ్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే అన్ని వర్గాల సంక్షేమం


గీతారెడ్డితో మాట్లాడుతున్న పోల్కం శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: ఇందిరమ్మ రాజ్యంలోనే అన్ని వర్గాల సంక్షేమం కొనసాగుతుందని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఏఐసీసీ సీనియర్ నాయకురాలు, మాజీ మంత్రి గీతారెడ్డి గురువారం గాంధీభవన్‌కు వచ్చిన సందర్భంగా ఆమెను పోల్కం శ్రీనివాస్ సన్మానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో చేపడుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. బడుగు బలహీన వర్గాలతో పాటు అందరి సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన అన్నారు. వెంటనే మేరు కులస్తుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కేటీఆర్ రూ.100 కోట్ల పరువునష్టం దావా విచారణ వాయిదా

సిటీ కోర్టులు: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొండా సురేఖపై దాఖలు చేసిన రూ.100 కోట్ల పరువునష్టం దావా విచారణ గురువారం హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టులో జరిగింది. నాగచైతన్య, సమంతల విడాకుల విషయంతోపాటు సినీ ఇండస్ట్రీలో పలువురు విడాకుల తీసుకోవడానికి తనే కారణమంటూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు సరైన కావని, ఎలాంటి ఆధారాలు లేకుండా ఆమె అసంబద్ధమైన వ్యాఖ్యలు చేయడంతో సమాజంలో తన పరువుకు భంగం కలిగిందని పేర్కొంటూ కేటీఆర్ రూ.100 కోట్లకు పరువునష్టం దావా వేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణను సిటీ సివిల్ కోర్టు 25వ అదనపు చీఫ్ జడ్జి కోర్టు చేపట్టింది. ఈ కేసులో మొత్తం (16 మందిపై) అందులో ప్రతివాది–1 కొండా సురేఖతోపాటు మరో 15 ప్రతికలు, టీవీ ఛానెళ్లపై కేటీఆర్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ విచారణలో పలువురు కౌంటర్లు దాఖలు చేయగా పలు పత్రికలకు సంబంధించిన వారు దాఖలు చేయాల్సి ఉంది. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు వచ్చే వాయిదా లోపు మిగతా ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను ఏప్రిల్ 2కు వాయిదా వేస్తున్నట్లు కోర్టు సూచించింది.